వీఎస్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం

వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సంజీవరెడ్డి

రాంనగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వీఎస్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, కార్మికులకు మూడు ఇంక్రిమెంట్‌లు మంజూరు అయ్యాయని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మూడు ఇంక్రిమెంట్‌లు మంజూరైనందుకు సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. 352మంది కార్మికులకు మూడు ఇంక్రిమెంట్‌లు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జి.సంజీవరెడ్డి చిత్రపటానికి కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు ఆర్.డి.చంద్రశేఖర్, కె.రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎల్.డి.పాల్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జి.నాగేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు రణధీర్‌రెడ్డి, సమ్‌అద్, కోశాధికారి డి.కృష్ణారెడ్డి, నాయకులు ప్రభాకర్, నవీన్, విజయేందర్, రామ్మోహన్, సాయిప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక కోడ్‌ల అమలు శ్రామిక ప్రజలపై దాడి

రాంనగర్: నాలుగు కార్మిక కోడ్‌ల అమలు శ్రామిక ప్రజలపై దాడి అని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలోని నిరంకుశ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, యాజమాన్య అనుకూల నాలుగు కార్మిక కోడ్‌లు అమలు చేస్తుందని ఆరోపించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రామికశక్తికి గౌరవప్రదమైన వేతనాలు, రక్షణ, ప్రగతిశీల సంక్షేమాన్ని నిర్ధారించడం కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి కేవలం కార్పొరేట్ కంపెనీల లబ్ధి కోసం నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశాన్ని దోపిడీ యుగంలోకి తీసుకెళ్లడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల జీవనోపాధిపై విధ్వంసక దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ నాలుగు కోడ్‌లను వెంటనే ఆపివేసి రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీటికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనక్‌ప్రసాద్, ఆర్.డీ.చంద్రశేఖర్, జగన్‌మోహన్‌రెడ్డి, విజయ్ కుమార్‌యాదవ్, త్యాగరాజన్, ఎల్.డీ.పాల్ పాల్గొన్నారు.

బీసీలను దగా చేయడానికే జీవో 46

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ


విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలను దగా చేయడానికే జీవో 46 తీసుకువచ్చిందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. హైకోర్టు తీర్పు వెలువడకముందే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హడావుడిగా ఎన్నికలు నిర్వహించడానికి జీవో తీసుకువచ్చిందని, దీనిని బీసీలు ఎట్టిపరిస్థితుల్లో సహించరని హెచ్చరించారు. సోమవారం జీవో 46కు వ్యతిరేకంగా కాచిగూడ డివిజన్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించి బీసీలను బొందపెట్టడానికే జీవో 46 తీసుకువచ్చిందన్నారు. 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకపోతే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేవిధంగా కేంద్రంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జీవో 46పై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జీవోను రద్దు చేయాలని ఇప్పటికైనా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రూ.5 భోజన కేంద్రాలు పెంచేందుకు చర్యలు

● నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి


సామాన్య ప్రజలతో కలిసి 5 రూపాయల భోజనం చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి తదితరులు

కవాడిగూడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఐదు రూపాయల భోజన కేంద్రాలను ప్రభుత్వం పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఉన్న 5రూపాయల భోజన కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించి తనిఖీలు చేశారు. పేదలకు సరిపడా భోజనం అందుతుందా, భోజనంలో నాణ్యత పాటిస్తున్నారా అనే అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా భోజనం చేయడానికి వచ్చిన వారికి ఆమె స్వయంగా భోజనం వడ్డించి సరైన సమయానికి భోజనం వస్తుందా, నాణ్యత పాటిస్తున్నారా అనే విషయాలపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ క్యాంటీన్ పథకం వల్ల దినసరి కూలీలు, వలస కూలీలు, విద్యార్థులు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ఆకలి బాధ తీర్చేందుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అవసరాన్ని బట్టి ఇందిర్మ క్యాంటీన్ కేంద్రాలను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

బర్కత్‌పుర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భువనేశ్వర్(25) లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 22న ఉప్పుగూడ రైల్వే స్టేషన్ వద్ద ఎంఎంటీఎస్ రైలు నుంచి జారి కిందపడిపోయాడు. కాళ్లు, చేతులు విరిగిపోవడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూలీ అదృశ్యం

బర్కత్‌పుర : కాచిగూడలో కూలీ అదృశ్యమయ్యారు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్‌ఐ హెచ్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రత్నానగర్‌కు చెందిన రాములు కుమారుడు పి.సైదులు(50) వృత్తిరీత్యా కూలీ. ఈ నెల 22న కూలిపనికి అని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆయన ఆచూకీ తెలియలేదు. కుమార్తె శివానీ సోమవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు, బంగారం చోరీ

బర్కత్‌పుర : కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు ఇళ్లల్లో దొంగలు విలువైన సెల్‌ఫోన్లు, బంగారు నగలు చోరీ చేశారు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక ఇందిరానగర్ ప్రాంతంలో ఉండే బాలరాజు ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించారు. అతడి ఇంటి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఇతడి ఇంటికి సమీపంలో ఉండే రాములు పరివారంతో పాటు బయటకు వెళ్లాడు. రాములు ఇంటి తాళం పగలగొట్టిన దొంగలు బీరువాలో రెండు తులాల బంగారు గొలుసు, ఉంగరం చోరీ చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాచిగూడ డీఐ మల్లేశం తెలిపారు.

యాచకుడిపై దాడి

చిక్కడపల్లి: చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ గేటు వద్ద ఓ యాచకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఆటోలో వచ్చిన కొందరు వ్యక్తులు లైబ్రరీ వద్ద ఉన్న నలభై సంవత్సరాల వయస్సున్న వ్యక్తిపై దాడికి దిగి తలపై కొట్టగా అతని తలకు గాయమై రక్తం కారింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుడు యాచకుడు అని చెబుతున్నారు. అతను తీవ్ర గాయాలపాలై ఉండడంతో వివరాలు చెప్పలేకపోయినట్లు చెబుతున్నారు. కాగా తరచూ లైబ్రరీ వద్ద కొందరు వైటనర్ తాగి అడ్డా వేస్తుంటారని దాంతో గొడవలు జరుగుతున్నాయని పోలీసులు నిఘా పెంచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిక్కడపల్లి ఎక్సైజ్ స్టేషన్ ప్రారంభం


ఎక్సైజ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్, సీఐ రామకృష్ణ

ముషీరాబాద్ : ముషీరాబాద్‌లో చిక్కడపల్లి ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, ఎక్సైజ్ అధికారులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడు తూ నూతన ఎక్సైజ్‌స్టేషన్ల వల్ల పని విభజన జరిగి మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. అక్రమ మద్యం అరికట్టడంతో పాటు మాదకద్రవ్యాలను నివారించేందుకు దోహదపడుతాయన్నారు. చిక్కడపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ నూతన ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో 11బార్‌లు, 12 వైన్ షాపులు, 4 కల్లుకంపౌండ్‌లు వస్తాయని పేర్కొన్నారు. తప్పనిసరి మద్యంషాపులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మేలా విధులు నిర్వహిస్తున్నాం అన్నారు. నూతనంగా టెండర్‌లో లైసెన్స్ పొందిన మద్యం వైన్‌షాపు యజమానులకు డిసెంబర్ 1వ తేదీ నుంచి అమ్మకాలకు అనుమతులు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్, డిస్టిక్ ఆఫీసర్ పంచాక్షరి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్‌ఐలు శ్రావణ్, నాగవల్లి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

స్వరాజ్యసాధనలో వందేమాతర గీతం..

బర్కత్‌పుర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్వరాజ్య సాధనలో వందేమాతర గీతం ప్రధాన భూమిక పోషించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. సోమవారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వందేమాతర గీతానికి 150 ఏళ్లు నిండిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. వందేమాతర గీతం దేశభక్తిని పెంపొందించడంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. నేటి విద్యార్థులు వందేమాతర గీతం స్ఫూర్తితో దేశాభివృద్ధికి జీవితాలు అంకితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.చిరంజీవి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి, నాయకులు క్షీరసాగర్, నందకిషోర్‌యాదవ్, సి.వినోద్‌యాదవ్, భీమ్‌రాజ్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, లావణ్య, రాజ్‌కుమారి, ఎస్ఎస్.రాము, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రపతి నిలయంలో ఫుడ్ కోర్ట్‌లో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వంటకాలను రుచి చూస్తున్న సందర్శకులు


రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన వివిధ పాఠశాలల విద్యార్థులు

రాష్ట్రపతి నిలయంలో...

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కళావైభవం

మూడో రోజు 9000 మంది సందర్శకులు హాజరు

అల్వాల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళామహోత్సవ్ రెండో ఎడిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్న పశ్చిమ రాష్ట్రాల విభిన్న సాంస్కృతిక, కళాత్మక వారసత్వ మహోత్సవ వేడుకల్లో మూడో రోజు సోమవారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్, హవేలీ, డామన్ డయ్యూలకు చెందిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన వంటకాలను ఫుడ్ స్టాల్స్‌లో విక్రయించారు. సోమవారం 9000 మంది సందర్శకులు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి కళామహోత్సవ్ వేడుకలను తిలకించారు.


జలమండలి సెక్షన్ మేనేజర్ శివసాయిని సన్మానిస్తున్న అజార్‌గల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, పూర్ణచందర్ తదితరులు

అజార్‌గల్లీలో తాగునీటి సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముషీరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్ 'అజార్‌గల్లీలో తాగునీటికి ప్రజల ఇక్కట్లు' అనే కథనాన్ని ఆంధ్రజ్యోతి సోమవా రం ప్రచురించడంతో స్థానిక జలమండలి అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. 20రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్న స్థానికంగా నివసించే 40కుటుంబాల సమస్యను అధికారులు పరిష్కరించడంతో అజార్‌గల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్ ముదిరాజ్, పూర్ణచందర్ తదితరులు జలమండలి సెక్షన్ మేనేజర్ శివసాయిని అభినందించి సన్మానించారు. మా ప్రాంతంలో నీటి సమస్యను పరిష్కరించారని నర్సింగ్‌రావు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నరేందర్, సదానంద్, గోవింద్, లక్ష్మి, మణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి


కలెక్టర్ హరిచందన దాసరికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల నిధుల మంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ యాకర అమృత కలెక్టర్ హరిచందన దాసరికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో కార్పొరేటర్ జిల్లా కలెక్టర్‌కు డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించేలా అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. 2006లో గాంధీనగర్‌లో నిర్మించిన ప్రభుత్వ క్వార్టర్స్ నేడు శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 13 పాత నల్లకుంట మాతృశ్రీ స్కూల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో నూతన పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పనులకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరగా అందుకు సానుకూలంగా స్పందించి పూర్తి చేయడానికి అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సుబ్రహ్మణ్యషష్టి పూజలు

చిక్కడపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో సోమవారం సుబ్రహ్మణ్యషష్టి పూజలు కనులపండుగగా ప్రారంభమయ్యాయి. సుబ్రహ్మణ్యషష్టి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకాలు, అనంతరం స్వర్ణపుష్పార్చనలు జరిగాయి. ఈసందర్భంగా సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు

చిక్కడపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు లభించే పథకాలను తెలియజేసే కార్యక్రమంలో చేపట్టిన అవగాహన సదస్సు సోమవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనర్ భవనంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించిన జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్ సునీతాగోపాల్‌దాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.2లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.5లక్షలు, గాయపడిన కార్మికులకు ఆస్పత్రి ఖర్చులకు గాను నెలకు రూ.4500 చొప్పున మూడు నెలలకు రూ.13,500, వివాహ కానుక రూ.30వేలు, ప్రసూతి ఖర్చు రూ.30వేలు, నమోదు కాని భవననిర్మాణ కార్మికులకు పని ప్రదేశంలో మరణిస్తే రూ.50వేలు వంటి అనేక పెరిగిన లబ్ధి ప్రయోజనాల గురించి సమావేశంలో పాల్గొన్న కార్మికులు, కార్మిక నేతలకు వివరించారు. పది రోజుల పాటు అవగాహన సదస్సులు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది కార్మికులను భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో నమోదు చేయించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె కార్మికనేతలు, కార్మికశాఖ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్(డీసీఎల్)లు బి. జానన్, శ్రీనివాస్‌గౌడ్, ఏసీఎల్, ఏఎల్‌వోలు పాల్గొన్నారు.


నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

రూ.52లక్షలతో నాలా విస్తరణ పనులకు శ్రీకారం

ముషీరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్ వినోభానగర్ ప్రేయర్‌పవర్ చర్చి వీధిలో రూ.52లక్షలతో నాలా విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని ప్రేయర్‌పవర్ చర్చి వీధిలో నాలా విస్తరణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రేయర్‌పవర్ చర్చి వీధిలో నాలా కృషించుకుపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు నాలా విస్తరణ పనులు చేపట్టామన్నారు. వినోభానగర్‌లో నాలా ప్రహరీ నిర్మాణం సైతం కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు అశోక్, ఉమామహేశ్వరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సుధాదేవి మృతిపై దత్తాత్రేయ సంతాపం

చిక్కడపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి సుధాదేవి రామరాజు మృతిపట్ల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ప్రకటించారు. సాహితీసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన సుధాదేవి రామరాజు మృతి సాహితీరంగానికి తీరని లోటు అన్నారు. ఆమె తన రచనల ద్వారా మహిళా రచయిత్రులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. సామాజిక సమస్యలు, ఆడబిడ్డల విద్య, సాంస్కృతిక విలువల పరిరక్షణ వంటి విషయాలపై సుధాదేవిరామరాజు రచనలు ప్రభావవంతంగా నిలిచాయన్నారు. సుధాదేవి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఈ కష్ట సమయంలో బాధను తట్టుకునే శక్తిని, ధైర్యాన్ని వారి కుటుంబసభ్యులకు అందించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.


కంచి ముదిరాజ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

కష్టపడే వారికే పార్టీలో ఉన్నత పదవులు : సుప్రియ

ముషీరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రాబోయే కార్పొరేటర్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ మరింత బలోపేతానికి పనిచేయాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి, పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే ఉన్నత పదవులు లభిస్తాయన్నారు. కంచిముదిరాజ్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారని అభినందించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిల్‌కుమార్, అజయ్‌గుప్తా, గిరి, బాలు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాప్రగడకు రావాల్సినంత గుర్తింపు రాలేదు


మాట్లాడుతున్న ఇనాక్, పక్కన జనార్దనమూర్తి

చిక్కడపల్లి : ఎల్లాప్రగడ సుబ్బారావు వైద్యశాస్త్రంలో పలు రుగ్మతలకు పరిశోధనలు చేసినా ఆయనకు రావాల్సినంత గుర్తింపు రాలేదని పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆయన కనుగొన్న పలు రుగ్మతల నివారణ ఔషధాలు పేటెంట్ గుర్తింపు పొందకపోవడం విచారకరం అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా వైద్యశాస్త్రంలో ప్రముఖుడు, పోలిక్ ఆమ్లం నిజస్వరూపాన్ని కొనుగొన్న డా. యల్లాప్రగడ సుబ్బారావు యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ ఎల్లాప్రగడ సుబ్బారావు వివిధ రసాయనాలు సమ్మేళనాలతో ప్రయోగాలు చేసి పోలిక్ ఆమ్లం కనిపెట్టారని ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ క్షీణతను అరికట్టడానికి దోహదపడుతుందన్నారు. ప్రముఖ పాత్రికేయులు జయచంద్ర, కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు ఎస్‌బి రామ్, గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కమ్యూనిటీహాల్ అందుబాటులోకి తేవాలి'

చిక్కడపల్లి : జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆధునికీకరణను 15 రోజుల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. రూ.26 లక్షలతో కమ్యూనిటీహాల్ ఆధునికీకరణ పనులు జరుగుతున్న క్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్‌లతో కలిసి కార్పొరేటర్ సోమవారం పనులను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ పనులు నత్తనడకన సాగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదును పట్టించుకుని వెంటనే పనులు పూర్తిచేయాలని అన్ని హంగులతో ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. జవహర్‌నగర్ వ్యాయామశాల ఆటస్థలం, కల్యాణమండపం పరిరక్షణ కమిటీ సభ్యులు మల్లేష్, బీజేపీ నేతలు ఉమేష్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

● సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి


మాట్లాడుతున్న డీసీపీ శిల్పవల్లి

కవాడిగూడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు సమాజంలో నేరాల అదుపుకు, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి సూచించారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు 'ఒక గొప్ప మార్పు ఇదే శ్రీకారం' అనే కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ సబ్ డివిజన్‌లోని పోలీసు అ ధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఏసీపీ ఎ.యాదగిరి, దోమలగూడ సీఐ ఎం.డీ.అంజద్‌అలీ, గాంధీనగర్ సీఐ బోస్‌కిరణ్, దోమలగూడ, గాంధీనగర్ డీఐ ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, విజయ, హరీష్, నర్సింహ, లిఖిత్‌సాయి, మౌనిక పాల్గొన్నారు.

జాతీయ రింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో బాల, బాలికలకు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్

గోల్నాక, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన ఫస్ట్ జూనియర్ జాతీయ రింగ్ టెన్నిస్ చాంపియన్‌షిప్--2025 పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొన్న బాలికల, బాలుర సింగిల్, డబుల్స్ జట్లు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నాయి. గుజరాత్ పాలన్‌పూర్‌లోని కౌటిల్య విద్యాపీఠ్‌లో ఈ జూనియర్ జాతీయ రింగ్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. టీమ్ చాంపియన్ షిప్‌లో మూడవస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను దక్కించుకున్నారు. ఇండివిజల్ బాలుర విభాగం, డబుల్స్ విభాగంలో మూడవస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్స్‌ను గెల్చుకున్నారు. ఈ మెడల్స్‌ను సాధించిన వారిలో ఎం.డీ. అలీబేగ్, ఎం.డీ. తాహెర్‌బేగ్‌లు ఉన్నారు. బాలికల సింగిల్స్ విభాగంలో మూడో స్థానంలో కె.కీర్తి, నాలుగవ స్థానంలో టి.సిందూ నిల్చి బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. బాలికల డబుల్స్‌లో సి.రిషీత, ఎం.అక్షయలు రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బి.శివశంకర్, జె.సౌమ్యలు మూడవస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను గెల్చుకున్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రింగ్ టెన్నిస్ ఇండియా ప్రధాన కార్యదర్శి కె.ఆర్.వి. శ్యాంసుందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. విశ్వనాథంలు అభినందించారు.